సాక్షి విజయనగరం

సోమవారం । 4 । నవంబర్ । 2024



పాఠశాల నుంచే ఉపాధి విద్య

జాతీయ విద్యావిధానంలో భాగంగా సరికొత్త చదువులు అందుబాటులోకి వస్తున్నాయి.

- 8లో



చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం పూర్తయింది.

- 8లో



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం

ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జి.శ్రావణి సిల్వర్ మెడల్ సాధించింది.

- 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం..

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ : వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్దేశించిన ఎమ్మెల్సీ అభ్యర్థిని సమష్టిగా పని చేసి గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రెల్లివలస గ్రామంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో జిల్లాలోని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేయబోయే అభ్యర్థిని గెలిపించుకుందామని ఎంపీటీసీలు, జెడ్పీటీసీకి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించేందుకు అవసరమైన పూర్తి బలం ఉన్న వైఎస్సార్‌సీపీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు. అమలు కాని హామీలతో ప్రజలను మోసపుచ్చే కూటమి నేతలను తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, పిన్నింటి కుమార్, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాల సందర్శన




జగతపల్లి వ్యూ పాయింట్ వద్ద పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని పర్యాటక ప్రదేశాలను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదివారం సందర్శించారు. పర్యాటకంగా ఇంకా ఈ ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేయాలోనని పరిశీలించారు. అనంతరం సున్నపుగెడ్డ జలపాతాన్ని సందర్శించి అక్కడ టూరిజం పరంగా ఏ పనులకు ప్రతిపాదించాలో సమాలోచన చేశారు.


108లో ప్రసవం

సీతంపేట: మండలంలోని గోరపాడుకు చెందిన బి.జానకి 108 అంబులెన్స్‌లోనే పండంటి ఆడబిడ్డను ఆదివారం ప్రసవించింది.గారపాడుకు చెందిన జానకికి పురిటినొప్పులు తీవ్రంగా ఉన్నాయన్న సమాచారం ఆశ వర్కర్ ద్వారా అందుకున్న 108 అంబులెన్స్ గారపాడు గ్రామానికి చేరుకుంది. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో సీతంపేట తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ రాములు, పైలట్ రామారావులు ఆశ వర్కర్ సహాయంతో డెలివరీ చేశారు. అనంతరం తల్లీబిడ్డలను సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది చొరవను కుటుంబసభ్యులు అభినందించారు.

రామతీర్థం చూసొద్దాం... రండి



రామతీర్థం బోడికొండ



బోడికొండపై భీముడి గుహకు దారి



రామతీర్థం శ్రీరామస్వామివారి ఆలయం



పాండవుల నివాస గుహలు



ఎప్పటికీ ఎండిపోని నీటి కొలను



దుర్గకొండపై జైనుల స్థూపం

భక్తులు పరమ పవిత్రంగా భావించే కార్తీకమాసం వచ్చేసింది. కార్తీకమాసం అంటేనే భక్తి మాసం. కార్తీక వన సందడి రామతీర్థంలోనే చేద్దామంటారు..అందరూ... రామక్షేత్ర మహత్యాన్ని తెలుసుకునేందుకు రామతీర్థం సందర్శించాల్సిందే.. ఓ వైపు ఎత్తైన బోడికొండ.. కొండపై ఉన్న నాటి గురుతులు.. బోడికొండపై గత ప్రభుత్వ హయాంలో రూ.3కోట్లతో నిర్మించిన కోదండ రామాలయం.. పక్కన నీటి కొలను.. సీతమ్మ వారి పురిటి మంచం(సీతారామునిపేట గ్రామం)... మరోవైపు బౌద్ధులు నడయాడిన గురుభక్తుల కొండ, పాండవులు సంచరించిన ఆనవాళ్లు.. ఎదుట పచ్చని నీటితో రామకోనేరు.. ఇలా దేని ప్రాధాన్యం దానిదే.. చూసి పరవశించాల్సిందే..

-నెల్లిమర్ల రూరల్

ఎందుకింత జాప్యం..!

- నత్తనడకన వైద్య కళాశాల భవనాల నిర్మాణం
- కావాలనే జాప్యం చేస్తున్నారని గుసగుసలు
- నిర్మాణం పూర్తయితే సర్వజన ఆస్పత్రిని వైద్య కళాశాలకు తరలించాలి
- ప్రస్తుతం ఉన్న చోటే ఉంచేందుకు అధికార పార్టీ నేత ప్రయత్నం
- వైద్య విద్యార్థులకు తప్పని అవస్థలు

జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేసి జగనన్న ప్రభుత్వం ప్రజల చిరకాల కోరికను తీర్చింది. కళాశాలను ప్రారంభించి రెండో ఏడాది తరగతులు కూడా జరుగుతున్నాయి. ఈ పనుల కోసం అప్పట్లోనే రూ.కోట్లు మంజూరు చేసి పనులను పరుగులు పెట్టించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏమైందో తెలియదుగాని పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లుల చెల్లింపులో తీవ్రమైన జాప్యం జరుగుతోంది.



ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న భోదనాస్పత్రి భవనం

విజయనగరం ఫోర్ట్:

జిల్లా ప్రజల చిరకాల కోరిక వైద్య కళాశాల. దీన్ని గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చింది. 2019లో అధికారం చేపట్టిన తరువాత జిల్లాకు గాజులరేగ సమీపంలో 70 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసింది. రూ.500 కోట్లతో వైద్య కళాశాల, బోధనాస్పత్రి, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించింది. వైద్య కళాశాలను కూడా ప్రారంభించింది. మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు పూర్తయి రెండో ఏడాది తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ఇక్కడ 150 మంది విద్యార్థులకు సీట్లు కూడా లభించాయి. గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరిగిన పనులు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా బోధనాస్పత్రి నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పాలకులు దీనిపై శ్రద్ధ కనబరచడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

సర్వజన ఆస్పత్రిని తరలించేందుకు ఇష్టం లేకే...

జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉంది. దీన్ని శాశ్వతంగా ఇక్కడే ఉంచేందుకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఇంజినీరింగ్ అధికారులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో సదరు ప్రజాప్రతినిధి సర్వజన ఆస్పత్రిని ప్రస్తుతం ఉన్న చోటే ఉంచేందుకు.. అవసరమైతే అదనపు భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే సర్వజన ఆస్పత్రిని అక్కడకు తరలించాలి. నిబంధనల ప్రకారం ఆస్పత్రి, వైద్య కళాశాల రెండూ ఒకే చోట ఉండాలి. కానీ ఆ విధంగా చేయడానికి అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఇష్టపడడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే ఇలా పనుల విషయంలో కాలయాపన చేస్తున్నారని సమాచారం.

వైద్య విద్యార్థుల అవస్థలు

వైద్య కళాశాల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉండడంతో రోజూ వైద్య కళాశాల నుంచి విద్యార్థులు ఆస్పత్రికి వస్తున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండూ ఒకే చోట ఉంటే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రొఫెసర్లు కూడా వైద్య కళాశాలకు, సర్వజన ఆస్పత్రికి తిరగాల్సిన అవసరం ఉంటుంది. రెండూ ఒకే చోట ఉంటే ఈ అవస్థలు తప్పుతాయి.

వసతుల్లేక అవస్థలు



సర్వజన ఆస్పత్రిలో వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

ప్రస్తుత ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులకు, యంత్ర పరికరాలు అమర్చేందుకు పూర్తి స్థాయిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అన్ని విభాగాలకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఒకటి రెండు విభాగాలకు ప్రొఫెసర్లు రావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో గదులు చాలక ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఒకే గదిలో ఉండాల్సిన పరిస్థితి. ముఖ్యంగా యంత్ర పరికరాలు ఏర్పాటు చేయడానికి గదులు చాలక వైద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా ఆస్పత్రి వైద్య కళాశాల ఏర్పాటుతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. రోగులు కూడా అధిక సంఖ్యలో వస్తున్నారు. రోగులకు పడకలు చాలక వరండాలో కొన్ని సందర్భాల్లో చికిత్స అందిస్తున్నారు. రోగులకు తగ్గట్టుగా వార్డుల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది.

బిల్లులు విడుదల కాక...

ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఆస్పత్రి నిర్మాణ పనులు నెమ్మదిగా జరగడం వాస్తవమే.. బిల్లుల చెల్లింపులకు సంబంధించి చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి. బిల్లులు పెడుతుంటే అప్‌లోడ్ కావడం లేదు. త్వరలోనే ఈ సమస్య తీరుతుంది.

– ప్రసాద్, ఏపీ వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ

వసతిగృహ విద్యార్థి మృతి

- ఆస్పత్రికి వచ్చేసరికే మృతి చెందాడన్న వైద్యులు
- నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్



శ్యామలరావు మృతదేహం



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కాటవీధిలో ఉన్న వెనుకబడిన తరగతుల వసతిగృహం ఏడో తరగతి విద్యార్థి ఆదివారం ఆకస్మాత్తుగా మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం చిల్లపేట రాజాం గ్రామానికి చెందిన శ్యామలరావు (12) ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకున్న తరువాత మంచి నీరు తాగి బట్టలు ఉతికేందుకు రూమ్ నుంచి వెళ్తూ.. కళ్లు తిరిగి స్పృహ తప్పి పడిపోగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి వచ్చేసరికే మృతి చెందాడని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు తెలిపారు. శ్యామలరావును సహచర విద్యార్థులు ఆస్పత్రికి తీసుకొచ్చిన వెంటనే క్యాజువాలిటీ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారని చెప్పారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికలో వెల్లడవుతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్యామలరావు కుటుంబసభ్యులు సర్వజన ఆస్పత్రికి చేరుకొని విలపించారు. వారి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్

వసతిగృహ విద్యార్థి శ్యామలరావు మృతిపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులను నివేదిక కోరారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద విద్యార్థి మృతికి సంబంధించి సహచర విద్యార్థులు, వసతిగృహం సిబ్బందితో ఆయన ఆదివారం మాట్లాడారు. సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థి మృతిపై వైద్యులతో మాట్లాడారు. ఈ సంఘటనపై సమగ్ర నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట చైల్డ్‌లైన్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యాపారం

- రాష్ట్ర రాజకీయాల్లో విద్యా వ్యాపారులదే కీలక పాత్ర
- విద్యా రంగాన్ని కాపాడుకోవాలి
- టీచర్స్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా విజయగౌరి
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో శర్మ



యుటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

జామి: రాష్ట్రంలో ప్రస్తుతం విద్యను వ్యాపారంగా మార్చేశారని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ధ్వజమెత్తారు. జామిలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ముందుగా యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యను వ్యాపార రంగంగా మార్చిన కొందరు ప్రస్తుతం రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం చదువును కొంటున్నారని, దీన్ని విడనాడి చదువు నేర్చుకోవాలని హితవు పలికారు. విద్య కార్పొరేట్ చేతుల్లో బందీగా మారిందని, దీన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం ఉన్నత విద్యను నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయగౌరి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కె.విజయగౌరి బరిలో ఉంటారని శర్మ ప్రకటించారు. యూటీఎఫ్ సభ్యులుగా ఆమె అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటిస్తూ విజయానికి కృషి చేయాలన్నారు. అర్హులైన టీచర్లను ఓటరుగా నమోదు చేసే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన గళం



జీఓ నంబరు 114 ద్వారా అర్హులుగా గుర్తింపు పొందిన కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులైజేషన్ చేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం తక్షణమే కొనసాగించాలని ఉత్తరాంధ్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తమ గళం విప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల ఏపీలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. గడిచిన 24 ఏళ్లుగా ప్రతీ ఏడాది కాంట్రాక్ట్ బాండ్‌పై సంతకాలు చేసి, రెన్యువల్ చేసుకుని ఉద్యోగాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు కాంట్రాక్ట్ లెక్చరర్లు అందరినీ క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. కమిటీ సభ్యులు కె.రవికుమార్, సిహెచ్.రవికుమార్, డి.సూర్యనారాయణ, ఎల్.సంధ్య, వి.శ్రీధర్, డి.ముత్యాలనాయుడు, త్రిమూర్తులు, బి.సంధ్యలత, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

లక్ష్య సాధనపై గురి పెట్టాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతానగరం: చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు ఉన్నతమైన లక్ష్యంపై విద్యార్థులు గురిపెట్టి కఠోర శ్రమతో సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం మైదానం వద్ద జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి 68వ విలువిద్య స్కూల్‌గేమ్స్ పోటీలు ఆదివారం ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. పదమూడు జిల్లాల నుంచి పాల్గొన్న అండర్ 14, 17, 19 విభాగాల బాలురు, బాలికల విలువిద్య పోటీల ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ విలువిద్య పోటీలకు మన్యం జిల్లా ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరిచి ప్రతిభ చూపేందుకు మంచి అవకాశమని అభిప్రాయ పడ్డారు. సామర్థ్యాన్ని, అవకాశాలను ఏ మాత్రం వృథా చేసుకోకుండా క్రీడాకారులు ఏకాగ్రతతో నైపుణ్యాన్ని మెరుగుపరచుకుంటే విజయం దాసోహం అవుతుందంటూ వారిలో స్ఫూర్తి నింపారు. నిర్వాహకులు క్రీడాకారులకు కల్పించిన ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర విలువిద్య అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణను కలెక్టర్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు, విలువిద్య రాష్ట్ర పరిశీలకుడు ఎన్.వి.రమణ, ఉప విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎం. మురళీకృష్ణ, సీతానగరం, పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు, కర్రి ప్రసాదరావు, ప్రిన్సిపాల్ జేవీఎస్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన మనోజ్ తివారి

జామి: మండలంలోని యాతపాలెం సమీపంలో రైలులో నుంచి జారిపడడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఒడిశా రాష్ట్రంలోని బరంపురానికి చెందిన మనోజ్ తివారి (40) రైలులో ప్రయాణిస్తూ జారిపడి తీవ్ర గాయాల పాలవడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వచ్చి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు.

హోంగార్డు మృతి



అప్పలనాయుడు మృతదేహం

వంగర: మండల పరిధి మగ్గూరు సమీపంలోని మడ్డువలస ప్రాజెక్టు డైక్ వద్ద శివ్వాం గ్రామానికి చెందిన హోంగార్డు పొదిలాపు అప్పలనాయుడు(53) మృతిచెందినట్లు ఏఎస్సై సూర్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అప్పలనాయుడు స్వగ్రామం శివ్వాం వచ్చి ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి విధులకు హాజరయ్యేందుకు బయల్దేరాడు. ఆదివారం ఉదయం మగ్గూరు సమీపంలో మడ్డువలస ప్రాజెక్టు డైక్‌ను ఆనుకుని హోంగార్డు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించి సమాచారం అందించారని ఏఎస్సై తెలిపారు. మద్యానికి బానిస కావడంతో అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య భారతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాముకాటుతో రైతు మృతి



పాముకాటుతో మృతి చెందిన అల్లు రమేష్

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన రైతు అల్లు రమేష్ (32) ఆదివారం మధ్యాహ్నం వరి పొలంలో చేను కోస్తుండగా పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కూలీలతో పాటు రమేష్ పొలంలో వరిచేను కోస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే ద్విచక్రవాహనంపై సాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

మెంటాడ: మండలంలోని కొంపంగి బ్రిడ్జి వద్ద కాపుకాసి 20 బస్తాలు (సుమారు 900కేజీలు) బియ్యంతో ప్రయాణిస్తున్న ఆటోను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై సీతారాం తెలియజేశారు. ముందస్తు సమాచారంతో పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

దళారులకు ధాన్యం విక్రయం



దళారులకు విక్రయించిన ధాన్యం బస్తాలు

బలిజిపేట: ఖరీఫ్ వరిపంట కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ధాన్యం విక్రయాల కోసం అన్నదాతలు దాళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2300 మద్దతు ధర ప్రకటించగా దళారులు రూ.1800లకు కొనుగోలు చేస్తున్నారు. తూకంలో తేడాలతో రైతులు మోసపోతున్నారు. 80 కిలోల బస్తాకు 4 కిలోలు చొప్పున ధాన్యాన్ని అదనంగా రైతుల నుంచి దళారులు తీసుకుంటున్నారు. కళ్లాల్లో ధాన్యం బస్తాలు నిల్వ చేయలేక, వాతావరణ పరిస్థితులకు భయపడి దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

పాఠశాల నుంచే ఉపాధి విద్య



మొక్కల సంరక్షణపై విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన

- పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులు అమలు
- 9,10 తరగతి విద్యార్థులకు రెగ్యులర్ విద్యతో పాటు ప్రత్యేక శిక్షణ
- నైపుణ్య సాధనకు క్షేత్రస్థాయి పరిశీలన

పార్వతీపురం: జాతీయ విద్యావిధానంలో భాగంగా సరికొత్త చదువులు అందుబాటులోకి వస్తున్నాయి. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రాయోజిత కార్యక్రమాలతో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో వృత్తి విద్యాబోధన సాగుతోంది. వాటిలో రెండు ప్రాథమిక పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పథకం ఐదు సంవత్సరాల వ్యవధిలో 2022–23నుంచి 2026–27 వరకు అమలవుతుంది. ఈ పథకానికి అవసరమైన నిధులను కేంద్రప్రభుత్వం అందజేస్తుంది. మంజూరైన నిధులతో పాఠశాలలో ప్రయోగశాలలు, విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలు సమకూర్చుకోవడం, డిజిటల్ పద్ధతిలో బోధన తదితర సౌకర్యాలను కల్పించుకోవచ్చు. ఇందుకు అవసరమైన శిక్షణను ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు అందజేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదవిద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు 2023–24 విద్యా సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే బలమైన పునాదులు పడ్డాయి.



పీఎంశ్రీ పథకంపై వివరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్(ఫైల్)

'అమలవుతున్న కోర్సులివే..

అగ్రికల్చర్, ఆటోమోటివ్ ఐటీ–ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్, జీఎఫ్ఎస్ఐ. హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్నాయి. వాటిలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకే కల్పిస్తున్నారు. పాఠశాలలో ప్రతిరోజూ ఒక పీరియడ్, ప్లస్‌టూలో వారంలో తప్పనిసరిగా మూడు పీరియడ్లు వృత్తి విద్యా కోర్సులు బోధించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. మరో మూడు పీరియడ్లు ప్రాక్టికల్స్ నిర్వహిస్తూ విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రావీణ్యం పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

'విద్యార్థులకు ఎంతో మేలు..



వృత్తి విద్యాకోర్సులతో ఎంతో మేలు జరుగుతుంది. ఉన్నత అధికారుల సూచనలకు అనుగుణంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వృత్తి విద్యను పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకు వెళ్లేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. స్కూళ్లను తరచూ సందర్శించి విద్యార్థుల ప్రగతిపై సమీక్షిస్తున్నాం.

– ఎన్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

పీఎంశ్రీ పాఠశాలలో ప్రయోగాలు..

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దూసుకువెళ్లేలా కేంద్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. పీఎంశ్రీ పథకం కింద 14 పాఠశాలలకు క్రీడా మైదానాలు, ఐదు పాఠశాలలకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు నిధులు మంజూరయ్యాయి.

నైపుణ్య హబ్‌లు..

పాఠశాల స్థాయిలో నైపుణ్యంతో కూడిన చదువులకు ప్రాధాన్యమిచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. ఫుడ్‌ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పాఠశాల పనిదినాల్లో రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తూ సెలవు రోజుల్లో వృత్తి విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులను క్షేత్ర సందర్శనకు తీసుకువెళ్తారు. పాఠశాలకు సమీపంలో కుటీర, మధ్య తరగతి పరిశ్రమలు, చేతి వృత్తి కేంద్రాలు, బ్యూటీషియన్ సెంటర్లలో శిక్షణ ఇస్తారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో సరిపోల్చుతూ మరింత అవగాహన కల్పిస్తున్నరు. విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకుని సరికొత్త ప్రయోగాలు చేసేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

'ఉపాధి పొందేలా తర్ఫీదు..

పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు స్వశక్తిపై నిలబడేలా జిల్లాలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో వృత్తి విద్యాకోర్సులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలలో ఇద్దరు చొప్పున బోధకులను నియమించారు. వారు 9, 10వ తరగతి, ప్లస్‌టూ కళాశాలలో ఆసక్తి ఉన్న విద్యార్థులను ఒక్కో ట్రేడ్‌కు 50 మంది చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌మీడియట్ పూర్తయ్యేసరికి ప్రతి విద్యార్థి తమకు నచ్చిన రెండు కోర్సుల్లో నైపుణ్యం సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియను సమగ్రశిక్ష అధికారులు పర్యవేక్షిస్తున్నారు

నదీస్నానాల వద్ద జాగ్రత్త చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్ ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: కార్తీక మాసం సందర్భంగా జిల్లాలో ఎక్కువ మంది భక్తులు వచ్చే శివాలయాలు, స్నానాలు ఆచరించే నదులు, సముద్రం, పిక్‌నిక్స్, వన భోజనాలు నిర్వహించే ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు, జాగ్రత్తలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్తీకమాసం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు నదులు, సముద్ర స్నానాలు ఆచరించే అవకాశమున్నందున పోలీస్‌స్టేషన్ పరిధిలోని నదీ స్నానాలు ఆచరించే ప్రాంతాలను గుర్తించి, ఆయాప్రాంతాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేయాలని, యువత నదుల్లో లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా బందోబస్తు, పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్తీక మాసంలో సోమవారాలు, ముఖ్య రోజుల్లో ఎక్కువ మంది భక్తులు శివాలయాలకు వచ్చే అవకాశమున్నందున పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన శివాలయాలను గుర్తించి, బందోబస్తు ఏరాచచేయాలని, ఎటువంటి దొంగతనాలు జరగకుండా నిఘా ఏర్పాటుచేయాలని స్పష్టం చేశారు.

విద్యార్థి మృతికి హాస్టల్ సిబ్బందిదే బాధ్యత



హాస్టల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి
- బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణంలో ఉన్న బీసీ హాస్టల్‌లో కొణతాల శ్యామలరావు అనే విద్యార్థి అనారోగ్యంతో హఠాన్మరణం చెందాడు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థి శ్యామలరావు మరణించడానికి ప్రధాన కారణం హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే అని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్ జానకిరామ్ గతంలో కూడా అనేక సార్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని, అసలు హాస్టల్‌కు ఎన్నో సార్లు ఆబ్సెంట్ అవుతూ విద్యార్థులను పట్టించుకునే వారు కాదని విమర్శించారు. గత రాత్రి విద్యార్థి అస్వస్థతకు గురైతే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని, కనీసం హాస్పిటల్‌కు కూడా తీసుకువెళ్ల లేదని విమర్శించారు. వార్డెన్ మీద నమ్మకంతోనే పేరెంట్స్ వారి పిల్లలను హాస్టల్‌లో చేర్పిస్తారని, అలాంటిది ఈరోజు ఆ విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారని దుయ్యబట్టారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్‌ను, సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో కుమారుడిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులకు ప్రభుత్వం తరఫున రూ.25 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కచ్చితంగా ప్రభుత్వం ఈ డిమాండ్లు నెరవేర్చాలని లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని దీనికి జిల్లా విద్యాశాఖ యంత్రాంగం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పోటీ పడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్ –13 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం పూర్తయింది. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరంలోని ఫైర్‌చెస్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి చెస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సీఈఓ కేవీ.జ్వాలాముఖి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపిక పోటీల్లో ఓపెన్ విభాగంలో ప్రథమ విజేతగా సీ.హెచ్.వినీల్ రాధా కార్తీక్, ద్వితీయ విజేతగా ఎం. కార్తీక్ గెలుపొందారు. బాలికల విభాగంలో ప్రథమ విజేతగా కె.మోక్ష, ద్వితీయ విజేతగా ఎస్.అమృత గెలుపొందారు. ఈ పోటీలలో విజేతలుగా గెలుపొందిన వారు ఈ నెల 18,19,20 తేదీలలో తాడేపల్లిగూడెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో పి.అర్చన, ఎస్.పద్మ, ఎ.దామోదర రావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

- ఎమ్మెల్యే మాధవిని విమర్శించడం సరికాదు
- జనసేన పార్టీ నాయకులు

నెల్లిమర్ల: కూటమి పొత్తు ధర్మానికి కట్టుబడి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాలన సాగిస్తున్నారని, ఆమెను విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదని జనసేన పార్టీ నాయకులు అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, నల్లి చంద్రశేఖర్, నక్కాన వెంకటరావు, చాప శ్రీను అన్నారు. నెల్లిమర్ల పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా ఎమ్మెల్యే మాధవిపై టీడీపీ నాయకుల వైఖరి అప్రజాస్వామికంగా ఉందన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించడం సరికాదన్నారు. అలాగే ఇటీవల జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగడం సమంజసమేనా అని ప్రశ్నించారు. జనసేన నాయకుల కంటే టీడీపీ నాయకులకే ఎమ్మెల్యే ఎక్కువగా అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మాధవిపై టీడీపీ నాయకులు తమ వైఖరి మార్చుకుని, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు మజ్జి రాంబాబు, పలిశెట్టి దొరబాబు, సారిపల్లి శంకరరావు, మద్దిల అప్పన్న, తుమ్మ వెంకటరమణ, ఫలణికుమార్, వాసు, చందక సంతోష్, గాంధీ, కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడి పిలుపు

విజయనగరం ఫూల్‌బాగ్:

ఈనెల 16,17తేదీల్లో విజయనగరంలో జరగనున్న సీపీఎం 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం, నిధి వసూల్ కార్యక్రమం స్థానిక ఫూల్‌బాగ్, ఉడాకాలనీ, తోటపాలెంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ జిల్లాలోను, నగరంలోనూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసింది సీపీఎం మాత్రమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ను తిప్పికొట్టి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పోరాడిన సీపీఎంను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రమణమ్మ, జగన్ మోహన్, రమణ, రామచంద్రరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతరవర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకం



పతకం అందుకుంటున్న శ్రావణి

విజయనగరం అర్బన్: ఆంధ్రా యూనివర్సిటీలో శనివారం నుంచి జరుగుతున్న ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జి.శ్రావణి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శ్రావణి గతంలో రెండు సార్లు రాష్ట్రస్థాయిలో బహుమతులు, పైడితల్లమ్మ వారి ఉత్సవంలో భాగంగా నిర్వహించిన క్రీడోత్సవంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నట్లు తెలిపారు. విద్యార్థిని స్వస్థలం నెల్లిమర్ల మండలంలోని టెక్కలి గ్రామమని తెలియజేశారు. శ్రావణికి సిల్వర్ మెడల్ రావడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రేఖ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్.పి.జయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్ కుమార్

- గజపతినగరం బాలికోన్నత పాఠశాలకు రెండవ బహుమతి

గజపతినగరం: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గజపతినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిప్పాడ రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి బహుమతి సాధించిన విద్యార్థినులను అభినందిస్తూ ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. విజయనగరం జిల్లా కేంద్రంలో నవంబరు 1న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన జరిగిందని ఈ ప్రదర్శనలో గజపతినగరంలోని పురిటి పెంట బాలికోన్నత పాఠశాల నుంచి సాయిశ్రుతి, జస్మితలు వారి గైడ్ సుజాత సహకారంతో ప్రాజెక్ట్ తయారుచేసి ప్రదర్శించి రెండవ బహుమతిని గెలుచుకున్నారని వివరించారు. ఇందుకు గాను ఆ విద్యార్థినులను హెచ్‌ఎం రమేష్ కుమార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మంత్రికి ఎంటీఎస్ టీచర్ల వినతి

సాలూరు: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు కోరారు. 1998 ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, పార్వతీపురం మన్యం జిల్లా యూనియన్ సెక్రటరీ కొల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల ఎంటీఎస్ ఉపాధ్యాయు లు ఆదివారం మంత్రి సంధ్యారాణిని పట్టణంలో ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీఎస్ పేరుతో తమకు అరకొర వేతనాలు ఇస్తున్నారని, తామంతా ఆర్థికంగా ఇబ్బంది లు పడుతున్నామని వాపోయారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఓ వివాహిత తన భర్తతో గొడవ పడి శనివారం ఉదయం తన కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. సమీప ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా కనిపించకపోవడంతో భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి విద్యార్థి మృతి



భాస్కరరావు మృతదేహం

రాజాం సిటీ: నీ కుమారుడు పాఠశాలలో అందరికంటే బాగా చదువుతున్నాడు. చదువు మధ్యలో నిలిపివేయకుండా చదివించమ్మ అని ఉపాధ్యాయులు అంటుంటే ఆ తల్లి ఉబ్బితబ్బిబ్బయ్యేది. చదువులో చురుగ్గా ఉన్న కుమారుడు ప్రయోజకుడై ఆదుకుంటాడనుకుంటుండగా కుమారుడు అకాల మరణం చెందాడన్న విషయం తెలుసుకున్న ఆ తల్లి జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదిస్తోంది. ఈ విషాదకర ఘటన రాజాం మండల పరిధి కంచరాం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి కృష్ణవేణికి బిడ్డ పుట్టిన ఏడాదికే ఆమె భర్త మరణించాడు. అప్పటి నుంచి కృష్ణవేణి ఓ జ్యూట్‌ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఒక్కగానొక్క కుమారుడు భాస్కరరావు (14)ను అల్లారుముద్దుగా పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివిస్తోంది. ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి భాస్కరరావు రాజయ్యపేట గ్రామ సమీపంలోని రాజుగారి కోనేరులో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతుండగా అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. భాస్కరరావును ఒడ్డుకు తీసి సపర్యలుచేసిన అనంతరం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై జనార్దనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అరసవల్లిలో కార్తీక సందడి

అరసవల్లి:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. వేకువజాము నుంచే భారీగా తరలి వచ్చిన మహిళలు ఇంద్రపుష్కరిణిలో కార్తీక దీపాలను వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళం డివిజనల్ ఆర్డీవో సాయి ప్రత్యూష తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకోగా ఆమెకు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ. 2.67 లక్షలు, విరాళాల ద్వారా రూ.77,166, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.35 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు.



కార్తీక దీపాన్ని స్వామికి చూపిస్తున్న భక్తురాలు